# ప్రజాస్వామ్యమే ఓడిపోయినట్టయితే ఏ పార్టీ గెలిస్తేనేమి ?

## కొంచెం ఆగి ఆలోచించమని పౌరహక్కుల సంఘం విన్నపం

***ప్రజలారా !***

పదకొండవ లోక్‌సభ ఎన్నికలు వచ్చాయి. రాబోయే అయిదు సంవత్సరాలు ఈ దేశాన్ని ఎవరు పరిపాలిస్తారో ఈ ఎన్నికలు నిర్ణయించాలి. రాబోయే అయిదు సంవత్సరాలలో దేశ సాంఘిక, ఆర్థిక విధానాలు ఇప్పుడున్నట్టే కొనసాగుతాయా లేక కొత్త రూపం తీసుకుంటాయా అనేది ఈ ఎన్నికలు నిర్ణయించాలి. దేశ పరిస్థితి, పరిపాలనా విధానాలు రాబోయే దినాలలో మెరుగవుతాయా లేక దిగజారుతాయా అనేది నిర్ణయించాలి.

కానీ ఎన్నికల ప్రచారంలో దీనికి తగిన చర్చ జరుగుతూ ఉందా? మనం ఏం చర్చించుకుంటున్నాం? పత్రికలు ఒక దానితో ఒకటి పోటీపడి ఏం రాస్తున్నాయి? మనకు ఏం చెప్తున్నాయి? ఎవరి ప్రచారం ఎంత ఆర్భాటంగా ఉంది, ఎవరు ఎంత జనాకర్షకంగా ప్రత్యర్థులను దూషించగలుగుతున్నారు, ఎవరు ఎంత పెద్ద ఎత్తున ఖర్చు పెట్టగలుగుతున్నారు, ఎవరికి ఎన్ని 'రిగ్గింగ్ గ్రామాలు' ఉన్నాయి, నెహ్రూ వారసత్వం ఎవరికి సంక్రమించింది, ఎన్టీఆర్ ప్రజాకర్షణ ఎవరికి వారసత్వమయింది, ఎవరు ఎన్ని ఎత్తులు వేసి గెలిచే టిక్కెట్ సంపాదించుకున్నారు, ఎవరు ఎంత తెలివిగా ఆఖరునిముషంలో పార్టీ ఫిరాయించారు, ఎవరి చాణక్యంఎంత, ఎవరి చాకచక్యం ఎంత - ఇదేగా ఎన్నికల గురించి జరుగుతున్న చర్చ? ఇదేగా పత్రికలు పేజీలకు పేజీలు చేస్తున్న విశ్లేషణ ?

పోనీ ఈ పనయినా పత్రికలు నిష్పాక్షికంగా చేస్తున్నాయా అంటే లేదు. ఒక్కొక్క ప్రముఖ దినపత్రిక ఒక్కొక్క పార్టీకి కరపత్రంగా పనిచేస్తూ ఉంది. ఒక పత్రికలో బ్రహ్మాండమయిన బహిరంగ సభగా కనిపించేది వేరొక పత్రికలో వట్టి సభగా సాక్షాత్కరిస్తుంది.

ఎన్నికల సందర్భంగా జరగవలసిన చర్చ ఇదేనా? ఎన్నికల పట్ల ఉండవలసిన ప్రజాతంత్ర వైఖరి ఇదేనా? ఎన్నికలు ఈ ప్రాతిపదిక మీద జరిగితే అసలు ఎన్నికలు జరుపుకోవడం ఎందుకు ?

**28-4-96 ఆదివారం సా॥ 5.00 గం లకు, లయన్స్ క్లబ్ కమ్యూనిటీ హాల్, రామ్‌నగర్, విశాఖపట్నంలో "ఎన్నికలు - ప్రజాస్వామ్యం" పై ఎ.పి.సి.ఎల్.సి. రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రొ॥ జి. హరగోపాల్ తదితరులు ప్రసంగిస్తారు. అందరూ ఆహ్వానితులే**

ప్రాతినిధ్యపాలన కోసం ఎన్నికలు జరుగుతాయి. ప్రజలన్యాయమైన ఆకాంక్షలకు, ఆరాటాలకూ ప్రాతినిధ్యం వహించే వ్యక్తులు, పార్టీలు ఎన్నికై తదనుగుణంగా దేశపాలన నిర్వహిస్తారనేది ఎన్నికల వ్యవస్థకు ఉండే సార్థకత. ప్రజల సమస్యలు, వాటి పరిష్కారం, ప్రజల కోరికలు, వాటి సాధనా మార్గాలు, ప్రజలు ఎదుర్కొంటున్న అణచివేత, దాని నుండి విముక్తి కలిగించే విధానాలు - వీటి ప్రాతిపదికన ఎన్నికలు జరిగితేనే అది తన ప్రజాస్వామ్య కర్తవ్యాన్ని నిర్వర్తించగలుగుతుంది.

డబ్బు, సారాయి, గూండాబలం, గతనాయకుల బొమ్మలు, మృతనాయకుల బూడిద - వీటి ప్రాతిపదికన జరిగే ఎన్నికలు తమ ప్రజాస్వామ్య కర్తవ్యాన్ని ఎట్లా నిర్వర్తించగలుగుతాయి ?

ముస్లింలపైన ద్వేషం రెచ్చగొట్టి 'హిందువు' అనే పేరుమీద వోటర్లను సమీకరించే రాజకీయం, అసంఖ్యాకమైన హవాలాల నుండి కూడబెట్టుకున్న వందల కోట్ల రూపాయలు వెదజల్లి వోట్లు కొనుక్కునే రాజకీయం, సినిమా స్టార్లను ఊరేగించి వోట్లడిగే రాజకీయం, మృతనాయకుల అసలు వారసులు తామేనని దబాయించి వోట్లు దండుకునే రాజకీయం, రౌడీ మూకలను పోషించి బాంబులువేసి రిగ్గింగ్ చేసి ప్రజలవోట్లు తామే వేసుకునే రాజకీయం - ఈ రకమైన రాజకీయాల మధ్య జరిగే వీధి కొట్లాటలకూ, ప్రజాస్వామ్య రాజకీయ సంవాదానికీ పోలిక ఏమైనా ఉందా? దీనినే ప్రజాస్వామ్యం అని తాము నమ్మి మనల్ని నమ్మింపజూస్తున్న మేధావులనూ, పత్రికలనూ ఏమనాలి?

మనం ఈ ఎన్నికల సందర్భంగా ఏ ప్రశ్నలు వేసుకోవాలి? అభ్యర్థులనూ, పార్టీలనూ ఏమని నిలదీయాలి? ఈ ఎన్నికలు సార్థకం కావాలంటే ఏ చర్చ జరగాలి? మనం వోటువేసేదీ లేనిదీ, వేస్తే ఎవరికి వేసేదీ ఏ ప్రాతిపదికన నిర్ణయించుకోవాలి?

గత అయిదేళ్లుగా దేశంలో అమలు అవుతున్న నూతన ఆర్థిక విధానాల ఫలితంగా విదేశీ మారకద్రవ్యం సమస్య పరిష్కారం కాకపోగా ధరలు పెరిగాయి. పేదరికం పెరుగుతూ ఉంది. నేషనల్ సాంపుల్ సర్వే లెక్కల ప్రకారం ప్రజలలో 40 శాతం దరిద్రరేఖకు దిగువన ఉన్నారు. ప్రభుత్వం తన బాధ్యత వదిలిపెట్టి ఆర్థికవ్యవస్థను పెట్టుబడి దార్ల ఇష్టాయిష్టాలకు వదిలేస్తుంటే ఈ 40 శాతం ప్రజల గతి ఏమవుతుంది? అన్ని ప్రధాన పార్టీలూ సరళీకృత ఆర్థిక విధానాలు అవసరమేనంటున్నాయి కాబట్టి ఈ ప్రశ్నకు ఏ పార్టీ ఏం సమాధానం చెప్తుంది? ఇదే క్రమంలో ఫ్యాక్టరీల మూసివేత నిరాఘాటంగా సాగుతూ ఉంది. ఖాయిలా పడిన మిల్లులకు ప్రాణం పోయడంకోసం నెలకొల్పిన బి.ఐ.ఎఫ్.ఆర్. ను వాటిని శాశ్వతంగా మూసివేసే ఉపాయాలు వెతికే యంత్రాంగంగా మార్చారు. మన రాష్ట్రం సంగతి చెప్పకోవాలంటే, మనం పారిశ్రామికీకరణలో దేశంలో అగ్రభాగాన లేముగానీ మిల్లుల మూసివేతలో మాత్రం దేశంలో రెండవస్థానంలో ఉన్నాము. మూసివేతే కాక కంపెనీల పునర్వ్యవస్థీకరణ కూడ నిరాఘాటంగా సాగుతూ ఉంది. సంఘటిత రంగ కార్మికులను అసంఘటిత రంగంలోకి నెడుతున్నారు. జీతభత్యాలకూ ఉద్యోగాలకూ నిన్నటిదాకా ఉన్న పాటి భద్రతకూడ లేకుండా చేస్తున్నారు. ఇదేమయినా రేపు ఆగుతుందా? ఏ పార్టీ దీనిని ఏ విధంగా ఆపుతుంది? ఆపుతూ ఆర్థిక సరళీకరణను ఏవిధంగా కొనసాగిస్తుంది ?

దీనివల్ల అధికంగా దెబ్బతినేది దళిత, వెనుకబడిన కులాల ప్రజలు, స్త్రీలు. కార్మిక వర్గానికి తగిలే ఏ దెబ్బయినా మొదట స్త్రీ కార్మికులకే తగులుతుంది. దళిత, వెనుకబడిన కులాల వారు ఎక్కువగా పనిచేసే చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు తగులుతుంది. ఈ వర్గాల ఉద్యోగ అవకాశాలు మరొక వైపునుండి కూడ దెబ్బ తింటున్నాయి. ప్రభుత్వం తన బాధ్యతలు ఒక్కొక్కటీ ప్రైవేట్ రంగానికి బదలాయించే కొద్దీ ఉద్యోగాల కోసం ప్రైవేట్ రంగంలో వెతుక్కోవలసి వస్తుంది. కానీ ప్రైవేట్ రంగం అగ్రకులాల గుప్పిట్లో ఉంది. ఆ రంగంలో రిజర్వేషన్ హక్కులేదు. దీని గురించి ఏ పార్టీ ఏం చెప్తుంది? ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించే కార్యక్రమం ఏ పార్టీ అజెండాలోనూ ఎందుకు లేదు? ఇప్పుడు ఏ పార్టీ అయినా దీనిని తన అజెండాలో చేర్చుకుంటుందా? కానీ ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లను ప్రపంచ బ్యాంకు ఆమోదించదు. ఇతర విదేశీ రుణ సంస్థలూ ఆమోదించవు. ఆ వ్యతిరేకతను ఎదుర్కొనడానికి ఏ పార్టీ ఏం చేస్తుంది?

దళితులకూ స్త్రీలకూ అధికారం కట్టబెడతామని అందరూ అంటున్నారు. కానీ రిజర్వుకాని ఎన్నిసీట్లకు ఏ పార్టీ అయినా దళిత అభ్యర్థులను ఎంపిక చేసింది? స్త్రీలకు ఏ పార్టీ అయినా ఎన్ని టిక్కెట్లిచ్చింది? మన రాష్ట్రంలోని అన్ని ప్రధాన రాజకీయ పార్టీలూ కలిసి 42 సీట్లకు గాను కేవలం 10 మంది స్త్రీలకు టిక్కెట్లిచ్చారు. మాటలకూ ఆచరణకూ మధ్య పొంతన లేని ఈ స్థితికి ఏ పార్టీ ఏం సంజాయిషీ చెపుతుంది ?

హిందుత్వవాదుల ఫాసిస్టు దాడులకు ఉత్తర భారతదేశంలోనూ మహారాష్ట్రలోనూ ముస్లింలు, క్రైస్తవులే కాక ప్రజాతంత్ర శక్తులంతా భయపడుతూ బ్రతికే పరిస్థితి ఉంది. హిందుత్వం పేరుమీద రాజకీయం చేయడంలో లౌకికతకు భంగమేమీ లేదని సుప్రీంకోర్టు అర్థరహితమైన తీర్పు ఇవ్వడం వీళ్ల ఫాసిజానికి బలం చేకూర్చింది. దేశ రాజధానిలో కాశ్మీర్ గురించి మాట్లాడడం అసాధ్యం అయిపోయింది. ప్రతీ సభమీద హిందుత్వవాదులు దాడిచేసి భగ్నం చేస్తున్నారు. ప్రజాస్వామ్యానికి వోటుహక్కు ఎంత ముఖ్యమో వాక్స్వాతంత్రమూ అంతముఖ్యం. వోటు పవిత్రత గురించి ఉపన్యాసాలిచ్చే ఈ రాజకీయ పార్టీలు వాక్ స్వాతంత్ర్యాన్ని కాపాడడానికి ఏం చేస్తాయి? ఇప్పటికి ఏం చేసాయి?

పోలీసు హింస ఈ దేశంలో ప్రజలు అనుభవిస్తున్న నిత్య జీవిత సమస్యలలో ఒకటి. పోలీసు స్టేషన్‌కు నిందితునిగానే కాదు, ఫిర్యాదిగా పోవాలన్నా భయపడే స్థితి ఉంది. వికృతమైన చిత్రహింసలు, లాకప్పుహత్యలు, బూటకపు ఎన్‌కౌంటర్లు ప్రతిరోజూ జరుగుతున్నాయి. మన రాష్ట్రంలోనయితే ఇకమీదట ఎన్‌కౌంటర్లు ఉండవు ఉండవంటూనే ఈ సంవత్సరం ఇప్పటికి 31 మందిని కాల్చి చంపారు. ఈ హింసను ఆపడానికి ఏ పార్టీ ఏం చేసింది? రేపు ఏం చేయబోతుంది? పోలీసు వ్యవస్థ చట్టబద్ధంగా పనిచేసేటట్టు చూస్తామని ఏ పార్టీ అయినా గుండెమీద చేయివేసుకొని చెప్పగలదా ?

ఇట్లా ఎన్నో ప్రశ్నలు అడగొచ్చు. భూసంస్కరణల గురించి, చెరువుల మరమ్మతుల గురించి, సాగునీటి గురించి, తాగునీటి గురించి, అంటరాని తనం గురించి, ఆకలిచావుల గురించి, వాతావరణ కాలుష్యం గురించి, కరవు గురించి, వరకట్నం మరణాల గురించి ప్రశ్నలు అడగొచ్చు. వీటి గురించి మాట్లాడకుండా బొమ్మలు పట్టుకొని, బూడిద పట్టుకొని, బాంబులు పట్టుకొని వోట్లు వేయించుకుపోదామని వచ్చే నాయకులను నిలదీద్దాం. ఎన్నికల వ్యవస్థ కోల్పోయిన సార్థకతను దానికి తిరిగి కల్పిద్దాం. ఏ పార్టీ గెలుస్తుందన్న మీమాంస వదిలిపెట్టి ప్రజాస్వామ్యాన్ని గెలిపించుకుందాం.

**ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం**

20 ఏప్రిల్ 1996

**(APCLC)**